

# నిత్యమరణశిక్షలు

నవులూరి వెంకటేశ్వరరావు

అతని కళ్ళు తేమగా వున్నాయి. అతనెవరో రాజయ్యకు తెలీదు. కృష్ణమూర్తికి, రాజయ్యకు స్నేహం అనదగిన పరిచయం వుంది. ఆ తేమ కళ్ళ మనిషి కృష్ణమూర్తి తాలూకు – అతని బంధువు. అతన్ని పరిచయం చేసినపుడు విచారపు నీడ ఏదో మీద పడ్డట్లనిపించింది రాజయ్యకు.

"ఈ సహాయానికి మీకు రుణపడి వుంటా" – కృష్ణమూర్తి.

"ఏం పర్లేదు, నాకు చేతనైనదంతా చేస్తా" – రాజయ్య.

అతన్ని రాజయ్య సంరక్షణ కొదిలేసి కృష్ణమూర్తి నిష్క్రమించాడు.

అతని ముఖంలోకి మళ్ళీ చూశాడు రాజయ్య, అతని కళ్ళలో కరడుగట్టిన దైన్యం. ఏదో విచారకరమైన వార్త విన్నప్పటిలా వికలమయింది మనసు.

కృష్ణమూర్తి క్యాంపు మీద వెళ్ళవలసొచ్చి ఊళ్ళో వుండడు పది – పదిహేన్రోజులు. ఇతను కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దిగువ మధ్యతరగతివాడు. దిక్కులేని రోగికి ప్రభుత్వ వైద్యశాలే గతి. ఓ.పి. టిక్కెట్టు రాయించి పరిచయమున్న ప్రభుత్వ వైద్యుడి గదికి అతన్ని తీసుకెళ్ళాడు రాజయ్య. అతన్ని ఆస్పత్రిలో అడ్మిట్ చేయమని చెప్పాడు రాజయ్యకు డాక్టరు. వార్డులో రాజయ్య అతన్ని వదిలేసి వస్తుంటే, కళ్ళు తుడుచుకుంటూ బెడ్డు మీద కూర్చుంటున్నాడు అతను.

రాజయ్య కష్టాలకు అది నాంది. పేరుకు తగని చాకరీ చేశాడు.

మధ్యాహ్నం, రాత్రి ఇంట్లో వండించి క్యారియర్‌తో భోజనం తెచ్చేవాడు. మాసిన బట్టలు తీసుకెళ్ళి ఇంటి చాకలి చేత ఉతికించి తెచ్చేవాడు. ఆస్పత్రి నరకపు వరండాలో పడిగాపులు కాస్తున్నపుడు దోమలు చంపుకు తినేవి. శరీరం మీద వాలిన వాటిని కసికొద్ది కొట్టి చంపబోతే, 'నీలాంటి వాళ్ళని చాలామందినిచూశాం' అన్నట్లు, అవి తప్పించుకుపోయి, రాజయ్య దెబ్బలు రాజయ్యకే తగిలేవి – అతను చేసినదో, చేస్తున్నదో తప్పకు తనకై తను విధించుకున్న శిక్షలా. పాయిఖానా దుర్వాసనకు ఎర్రైన ముక్కు, అది దుర్వాసనన్న విషయం కూడా మరిచి దానికలవాటుపడిపోయింది. ప్రపంచ పాయిఖానాలన్నింటికి తల్లిలా వాసనకొట్టేది.

ఆపరేషను రోజు వచ్చింది. ఆస్పత్రి గుడ్డల్లో శాపగ్రస్తుడిలా, కేవలం దుఃఖించడానికే పుట్టినట్లు తోచాడు. నవ్వు వచ్చింది. మనసులో తన మీద తను కోప్పడ్డాడు రాజయ్య.

థియేటరులోకి వెళ్ళబోయే ముందు రాజయ్యను కౌగలించుకుని భోరుమన్నాడు. "నా చిన్నపుడే తల్లీతండ్రి పోయారు..." వెక్కుతూ అన్నాడు. కళ్ళు తుడిచి "ఛా, ఏంటిది?" అని ధైర్యం చెప్పాడు. ఒంటరివాడు – ప్రాణం మీద ఎందుకంత తీపి? బతికి ఏమనుభవించాలి, ఎవరి గురించి బతకాలి. అలా అని అలాంటి వాళ్ళంతా చావును తెరచిన బాహువులతో ఆహ్వానించాలనీ కాదు. పాతికేళ్ళ వయసులో, ఆపరేషను థియేటరుకెళ్ళబోతూ పసిపిల్లాడిలా, బేలగా ఏడవటమనే విడ్డూరపు నేపథ్యంలోని భావనలవి.

ఆ రోజు రాత్రి జాగరణ సాగుతోంది. ఏ రోగపు బాధ ఈ వాతావరణపు బాధకన్న అధికమయినది అని అనుక్షణం ప్రశ్నించుకుంటు గడుపుతున్నాడు రాజయ్య. ఒళ్ళంతా దద్దులు, కళ్ళంతా మంటలు. అర్ధరాత్రి వరండా బెంచి మీద కునికిపాట్లు పడుతున్నపుడు రోగి హడావుడి చేస్తున్నాడని రాజయ్యని చేత్తో 'తట్టి' చెప్పింది నర్సు. అది తట్టి, చెప్పటమో, తోసి చెప్పటమో అర్థంకాలేదు రాజయ్యకు. కిందనించి లేచి దుమ్ము దులుపుకుంటూ ఆమె ఆహారంగా ఏమి తీసుకుంటుంటుందో కనుక్కుంటే బాగుండు అనుకున్నాడు పుల్లకన్నా సన్నటి రాజయ్య.

డ్యూటీ డాక్టరు ఇంజెక్షన్లు, మందులు రాసిచ్చి "ఇవి అరగంటలో తెస్తే మంచిది" అన్నాడు – సప్తసముద్రాల కావల, కొండగుహలో రాక్షసుల కాపలా కింద వున్న పారిజాతాన్ని వచ్చే పున్నమిలోగా తేకపోతే రాజు దక్కడని రాజకుమారుణ్ణి పంపే రాజవైద్యుడి ఫక్కీలో.


సైకిలు షెడ్డుకు తూలుతూ వెళ్ళి, అది ఎక్కి వెళుతుంటే, "ఆస్పత్రిలో ఈ మందు ఎక్కడ దొరుకుతుంది చెప్మా" అనుకున్నాడు. గేటు మనిషి రాజయ్యను అసూయగా చూస్తూ, పెదవులు తడుపుకుంటు.

తొమ్మిది షాపులు తిరిగినా మందులు దొరకలేదు. పారిజాతం తేవటమే తేలికేమోననిపించింది. టయిం యాభై నిమిషాలు గడిచింది. మరో షాపు కాలింగ్ బెల్లు నొక్కుతుంటే కృష్ణమూర్తి గుర్తుకొచ్చాడు. అతనొక పరోపకారి పాపన్న. సమాజానికి ఉపయోగపడే అలాంటి వ్యక్తికి ఈ మాత్రం సహాయం చేయలేకపోతే ఎలా? తనను నమ్మి తన సామర్థ్యం మీద విశ్వాసంతో అప్పగించిన ఈ చిన్న బాధ్యతను నిర్వర్తించలేకపోతున్నానే అన్న గిల్టీ బాధ పెట్టసాగింది. మందులు దొరక్క ఆ రోగి చనిపోతే ఎవరు మాత్రం – కృష్ణమూర్తయినా సరే – చేసేదేముంది అని సమాధానపడబొయ్యాడు. బాధ్యతలు, గీధ్యతలు పక్కనుంచుదాం – సాటి వ్యక్తి, తోడూ నీడా లేని వాడు, డబ్బూ గిబ్బూ లేనివాడు, చావుబతుకుల సరిహద్దులో కొట్టుమిట్టాడుతుంటే, ఏమీచేయలేకపోతున్నందుకు మనసులో కలుక్కుమంటోంది.

దిక్కుమాలిన మందులు రాసిన వైద్యుడిని తిట్టుకున్నాడు రాజయ్య. దిక్కుమాలిన వాళ్ళకు వాళ్ళజాతి మందులే రాయాలని హిపోక్రటీజ్ చెప్పేడేమో.

"రాత్రిళ్ళు కూడా మందులు దొరకును" అని చక్కని తెలుగులో బోర్డున్న పదకొండో షాపు మెట్లెక్కి కాలింగ్ బెల్ స్విచ్చికై వెతుకుతుంటే, అదీ దాని పక్కన "కుక్కలున్నాయి జాగ్రత్త" అన్న బోర్డు దృష్టికి తగిలాయి.ఏదో పెన్నిధి దొరికినట్లు స్విచ్ మీదికి వేలు చేర్చాడు.

ఎవరో మేడమీద లైటువేసి దిగివస్తున్నారు. కిందికొచ్చి,కిటికీ రెక్క తీసి, బుల్డాగ్ వంటి ముఖం కల వ్యక్తి ఆ జాతి జీవి చేసే పని రెండు నిముషాలపాటు చేశాడు. ఆ మొరుగుడుకు కారణం తెలిసింది. అపుడు స్విచ్ మీద నించి వేలు తీశాడు రాజయ్య. ప్రిస్కిప్షన్ చూసిగాని ఆ వ్యక్తి శాంతపడలేదు. "రెండొందల పది రూపాలా పదేను పైసలవుతది" అన్నాడు, తెలుగు మీద ఆంధ్రభోజుడికి వున్నంత అభిమానాన్ని ఆ మాటల ద్వారా వ్యక్తం చేస్తూ.




మందులు "దొరికి"నందుకు సంతోషం వెల్లివిరిసింది వెలిగించిన చిచ్చుబుడ్డిలా; అంత డబ్బుందా అన్న అనుమానం వెంటనే పుట్టి ఆ బుడ్డి మీద నీళ్ళు కుమ్మరించినట్లయింది.

ఆఖరి పది పైసల బిళ్ళతో లెక్కవేస్తే, ఆ మందుల గురించే వున్నట్లు రెండొందల పదకొండు "రూపాలా" పదిహేను పైసలున్నది. నెల గడవటానికి ఇంకా ఇరవై రోజులుంది. ఎందుకైనా మంచిదని, పొద్దున్నే వంద రూపాయలు అప్పు చేశాడు.

మందులతో, జేబులో మిగిలిన రూపాయతో షాపు నించి బయటికి అడుగుపెడుతున్నపుడు, షాపాయన తీయటి చిరునవ్వు నవ్వాడు. బుల్డాగులు మొరగటం, కరవటమేగాక చిరునవ్వులు కూడా చిందించగలగడం వింతైన విషయం అనుకున్నాడు రాజయ్య.

డాక్టరు విధించిన గడువు దాటి అరగంటయింది. ఆస్పత్రి ఆవరణలోకి అడుగుపెడుతుంటే, అతను ప్రాణంతో వున్నాడా లేదా అన్న ప్రశ్న, ఇంత కాలయాపన అయినందుకు డాక్టరు ఎలాంటి మాటలంటాడో అన్న శంక వేధించడం ఎక్కువయింది. ఇది కొనితెచ్చుకున్న కాళరాత్రి అనిపించింది. కాళ్ళు పీకుతున్నాయి. తిరిగి తిరిగి నిద్రలేని కళ్ళు చింతనిప్పులు. అలసట, ఆయాసం.

డాక్టరు ఏమీ అనలేదు – అతనికి ధన్యవాదాలు; రోగి చావలేదు – భగవంతుడికి కృతజ్ఞతలు.

"నిజానికి, మందులు ఇవ్వడవసరం లేదు, ముందు జాగ్రత్తగా తెమ్మన్నా" అన్నాడా వైద్యుడు ఓదార్పుగా – బిందెడు నీళ్ళు కుమ్మరించినట్లు చెమటకు తడిసిన చొక్కాను, ముఖాన్ని మార్చి మార్చి చూస్తూ (ముక్కు చిట్లించి కాస్త వెనక్కు జరిగాడనుకోండి, అది వేరే విషయం).

ప్రభుత్వ వైద్యుల్లో కూడా దయాగుణం వుండొచ్చు, మహాత్ములూ వుండచ్చు. ఇదే నిదర్శనం!

ఆ పదిహేను రోజుల కాలంలో అతను నవ్వగా చూడలేదు. నోరు తెరచినపుడల్లా దీనమైన స్వజీవిత గాథను ఏడున్నొక్క రాగంలో ఆలపించాడు. హృదయం కరిగి మౌనంగా రాజయ్య విలపించాడు. ఇంటికొచ్చి పెళ్ళాం పిల్లల్ని నిర్లిప్తంగా, రాగరహితంగా, మాటాపలుకు లేకుండా చూస్తూ వుండిపోయేవాడు చాలాసేపటిదాకా.

పదిహేను రోజులు గడిచినా కృష్ణమూర్తి జాడలేదు. ఈ లోగా అతను కోలుకున్నాడు. డిశ్చార్జి చేశారు. రాజయ్య ఇంట్లో రెండ్రోజులున్నాడు. ఆ నెల మొత్తం నాలుగొందలు అప్పుచేశాడు. అంతా ఖర్చయిపోయింది. మరో రెండు మూడు రోజులు గడవాలి ఆ నెలకు.

మూడో రోజు అతను ఊరు బయలుదేరాడు. స్టేషనుకు సైకిలు మీద తీసుకెళ్ళాడు రాజయ్య. షెడ్డులో సైకిలు పెట్టాడు. వళ్ళో బట్టల సంచి పెట్టుకుని సైకిలు క్యారేజి మీద కూర్చున్న అతను నెమ్మదిగా దిగి సంచీ రాజయ్యకిచ్చాడు. సంచి అందుకుని స్టేషన్లోకి పోర్టర్లా నడిచాడు రాజయ్య. సంచీ మోస్తూనే క్యూలో నిలబడి టికెట్టు తీశాడు రాజయ్య.

ప్లాట్‌ఫాం మీద రైలు ఆగివుంది. ఖాళీ పెట్టెలో ఎక్కి, సీట్లో సంచీ వుంచుకుని పెట్టె దిగి నిలబడ్డాడతను. రైలు కూసింది పోదామని.

"పి. సంతోషం" అని పచ్చబొట్టున్న కుడి చేతిని, పచ్చబొట్టు లేని యడమ చేతిని నమస్కారంగా జోడించి ఇలా అన్నాడు :

"భగవంతుడి దయవలన బతికి బట్టకట్టి మావూరు వెళుతున్నా... శలవండీ".

బట్టతలన్న విషయం మరిచిపోయి, జుత్తు పీక్కోటానికి తలనుచేరాయి రాజయ్య రెండు చేతులూ!!

■